నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 31 డిసెంబర్ 2024 | SURYAPET

## అంతర్ జిల్లా దొంగల అరెస్టు

నీలగిరి, డిసెంబర్ 30 : తాళం వేసిన ఇండ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8.25 తులాల బంగారం, బైక్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నార్కట్‌పల్లిలోని నల్లగొండ క్రాస్‌రోడ్ వద్ద సోమవారం ఎస్ఐ క్రాంతికుమార్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆటోలో వెళ్తు అనుమానాస్పందంగా కనిపిండంతో అదుపులోకి తీసుకొని విచారణ చేసినట్లు తెలిపారు. వారిని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్, సిరిసిల్లా జిల్లాకు చెందిన సందరికారి సతీశ్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. సాయిబాబ గతంలో దొంగతనం కేసులో కరీంనగర్ జిల్లా జైలుకు వెళ్లగా అక్కడ సతీశ్ పరిచయమయ్యాడని, తర్వాత ఇద్దరు కలిసి సెప్టెంబర్ 25న జైలు నుంచి బెయిలుపై విడుదలై నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు సమీపంలో పాడుబడిన ఇంట్లో ఉంటూ తిరిగి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డిగూడెం, ఎం.యడవల్లి, మోత్కూరు మండలంలో దొంగతనం చేసినట్లు పేర్కొన్నారు. వీరిపై పలు జిల్లాలో 40 దొంగతనం కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేవంలో ఇన్‌చార్జి సీఐ వెంకటయ్య, నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్, సిబ్బంది ఉన్నారు.


నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు కూనంనేని, పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి తదితరులు

# బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి దేశాన్ని విముక్తి చేయాలి

- అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి
- సీపీఐ శత వసంతాల ఉత్సవాల్లో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా
- ఆది నుంచి పోరాటాలకు ఎర్రజెండా ఊపిరి పోసింది : సురవరం
- ఎర్రజెండాలన్నీ ఒక్కటి కావాలి : కూనంనేని

నల్లగొండ, డిసెంబర్ 30 : దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు మతతత్వ ఫాసిస్టు అయిన ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకు దేశంలో ఉన్న అన్ని ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్షాలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో సోమవారం సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట రెడ్డి అధ్యక్షతన సీపీఐ వంద వసంతాల ఉత్సవాల సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.రాజా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీతో కలిసి కమ్యూనిస్టులు పోరాటం చేశారని, అదే స్ఫూర్తితో మరోసారి పోరుబాట పట్టి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీని తరిమి కొట్టాలని అన్నారు. వందేండ్ల కింద స్థాపించిన సీపీఐ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినిదించిన మొదటి పార్టీగా పేర్కొన్నారు. భారత రాజ్యంగ నిర్మాత అయిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మోదీ సమర్థిస్తూ మంత్రి వర్గంలో ఉంచడం సరికాదని, వెంటనే ఆయన్ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కోట్లకు అధిపతులైన అంబానీ, అదానీకి అండగా ఉంటున్న మోదీ వారికి నిత్యం సంపద సృష్టించి పెట్టడంలో బిజీగా ఉన్నాడని విమర్శించారు. అనంతరం ఆ పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారత్‌లో 1925లో ఆవిర్భవించిన సీపీఐ బ్రిటీష్ సామ్రాజ్య వాదుల కుట్ర కేసుల్లో ఇరుక్కున్న సందర్భంలో అనేక మంది సుదీర్ఘ జైలు జీవితం అనుభవించినట్లు తెలిపారు. సాయుధ పోరాటంలో సీపీఐ చేసిన త్యాగాలు వెలకట్టలేనివని, ఆ పోరాటాల్లో 4500 మంది అమరులయ్యారని, ఆ ఫలితంగానే 1948లో తెలంగాణ భారత యూనియన్‌లో విలీనం అయినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా అంటేనే పోరాటాల ఖిల్లా అని, రావి నారాయణ రెడ్డి మొదలు..దొడ్డి కొమురయ్య వరకు ఈ జిల్లా వాసులేనని అన్నారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే దేశంలో ఉన్న ఎర్ర జెండాలన్నీ ఒక్కటి కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు న్యాయబద్ధంగా చేసిన ప్రతి చట్టంలో కమ్యూనిస్టులదే ప్రధాన పాత్రగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు, శ్రేణులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. కళాకారుడు నర్సింహ ఆధ్వర్యంలో పలు పాటలతో కార్యకర్తలను ఉర్రూతలూగించారు. సభకు వచ్చిన సీపీఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎర్రదుస్తులు ధరించి రావటంతో ఎన్‌జీ కళాశాల ప్రాంగణం ఎరుపుమయమైంది. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు సీనియర్ సీపీఐ నేతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాష, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ్ శంకర్, బాల నర్సింహ, బాగం హేమంత్ రావు, ఈటీ నర్సింహ, వీఎస్ బోస్, నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లా కార్యదర్శులు నెల్లికంటి సత్యం, గోదా శ్రీరాములు, బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, పల్లా నర్సింహా రెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు, పువ్వాడ నాగేశ్వర్ రావు, కందిమల్ల ప్రతాప్ రెడ్డి, మోహినొద్దీన్, దొడ్డ నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

# టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 24,905



| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | ఓటర్ల సంఖ్య |
|---|---|---|
| నల్లగొండ | 37 | 4,483 |
| సూర్యాపేట | 23 | 2,637 |
| యాదాద్రిభువనగిరి | 17 | 921 |
| సిద్దిపేట | 4 | 163 |
| జనగాం | 12 | 921 |
| హన్మకొండ | 15 | 5,098 |
| వరంగల్ | 13 | 2,225 |
| మహబూబాబాద్ | 16 | 1,618 |
| భూపాలపల్లి | 7 | 323 |
| ములుగు | 9 | 612 |
| భద్రాద్రి | 23 | 1,949 |
| ఖమ్మం | 24 | 3,955 |
| మొత్తం | 200 | 24,905 |

## తుది ఓటర్ల జాబితా వెల్లడి.. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్!




నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ శాసన మండలి ఉపాధ్యాయ నియోజవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితా విడుదలైంది. మొత్తం 24,905 మంది ఓటర్లతో కూడిన జాబితాను కలెక్టర్ ఇలా త్రిపాఠీ వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గత అక్టోబర్ ఆరంభం నుంచే ఓటర్ల నమోదుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం గత నెల 6 వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దాంతో నియోజకవర్గం పరిధిలోని 12 జిల్లాల నుంచి ఓటు హక్కు కోసం మొత్తం 28 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పలు దఫాలుగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం లేని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇవి పోగా గత నెల 23న మొత్తం 22,554 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. దీనిపైనా తిరిగి అభ్యంతరాలను స్వీకరిస్తూ... ఇదే సమయంలో కొత్తగా దరఖాస్తులకు అనుమతించారు. దాంతో కొత్తగా 2,351 మంది ఓటర్లు పెరిగారు. వీటన్నింటి అనంతరం తుది జాబితాను సిద్ధం చేసి సోమవారం తుది ఓటర్ల జాబితా వెల్లడించారు. మొత్తం 12 జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 24,905గా నమోదైంది. అందులో పురుషులు 14,940 మంది, మహిళలు 9,965 మంది ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 20,888 మంది ఓటర్లుగా ఉన్నారు. ఈసారి అదనంగా 4,017 మంది ఓటర్లు నమోదయ్యారు. ఈ తుది ఓటర్ల జాబితా ఆధారంగానే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసి మార్చిలో పోలింగ్ నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి టీఎస్ యూటీఎఫ్‌కు చెందిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఆయన పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో త్వరలోనే ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సన్నద్ధవుతున్నది. ఇక పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా గతంలో 181 ఉండగా, ఈసారి 200కి పెరిగింది. అదనంగా 19 పోలింగ్ కేంద్రాలు రానున్నాయి. కాగా, ఇప్పటికే ప్రధాన సంఘాల నుంచి అభ్యర్థులు ఖరారయ్యారు. టీఎస్ యూటీఎఫ్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి అభ్యర్థిగా ప్రచారంలోకి దిగారు. పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, టీచర్స్ జాక్ పేరుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మరో సంఘం నుంచి హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను కలుస్తున్నారు. తుది జాబితా వెల్లడి కావడంతో మరింత ముమ్మరం ప్రచారం చేసేందుకు ఆయా సంఘాల అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు.

# నూతన సంవత్సర వేడుకలకు సన్నద్ధం

## ఉత్సాహంగా గడిపేందుకు జనం ఏర్పాట్లు



- మార్కెట్లలో కేకులు, స్వీట్ల అమ్మకాలకు సిద్ధం
- రాత్రి 10గంటల తర్వాత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- నిబంధనలు పాటించాలంటున్న పోలీసులు

రామగిరి/నేరేడుచర్ల, డిసెంబర్ 30 : 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనం సిద్ధమవుతున్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపేందుకు ముఖ్యంగా యువత ప్లాన్ చేసుకున్నారు. దాంతో విందు వినోదాలు పెద్ద ఎత్తున సాగనున్నాయి. స్వీట్లు, కేకులు, పటాకుల అమ్మకాలు జోరుగా సాగనున్నందున అందుకనుగుణంగా మార్కెట్లు సిద్ధమయ్యాయి. మంగళవారం సాయంత్రం నుంచే వేడుకల్లో జనం మునిగి తేలనుండగా పోలీసులు పలు ఆంక్షలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయొద్దని, అర్ధరాత్రి తర్వాత బయట తిరుగొద్దని పలు నిబంధనలు విడుదల చేశారు. రాత్రి 10గంటల తర్వాత మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

**పోలీసుల ఆంక్షలు ఇవే..**

- 31న రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే బైండోవర్ చేస్తారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు.
- వైన్స్‌లకు రాత్రి 12గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లకు రాత్రి 1 వరకు విక్రయాలకు అనుమతి ఉన్నది. దుకాణదారులు సమయ పాలన పాటించాలి.
- గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాలు సేవించే వారిపై నిఘా ఉంటుంది.
- ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు.
- ఆరుబయట మద్యం సేవించొద్దు. గ్రూపులుగా తిరుగొద్దు.
- డీజే, ఆర్కెస్ట్రా, పటాకులు కాల్చడం నిషేధం.
- అన్ని ప్రాంతాల్లో పోలీసుల గస్తీ, మఫ్టీలో పోలీసుల నిఘా ఉంటుంది.

## అర్ధరాత్రి బలాదూర్ తిరిగితే కఠిన చర్యలు

- నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, డిసెంబర్30 : నూతన సంవత్సర వేడుకల పేరుతో ఇష్టానుసారంగా అర్ధరాత్రి బలాదూర్ తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. అకారణంగా, నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై సంచరిస్తే సహించేది లేదని తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ పట్టణంలో డిసెంబర్ 31 వరకు ఆపరేషన్ చబుత్ర కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దీని ద్వారా పట్టణంలో నేరాలు జరుగకుండా, యువకులు చెడు ధోరణుల వైపు వెళ్లకుండా, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా మంచి ఫలితాలు వస్తున్నాయని, ప్రజల నుంచి కూడా మంచి స్పందన ఉందని చెప్పారు. జిల్లా కేంద్రంలో డీఎస్పీ శివరాంరెడ్డితోపాటు నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లకు చెందిన ఇద్దరు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 98 మంది కానిస్టేబుళ్లు 13 చెకింగ్ బృందాలుగా ఉన్నారని, 10 పెట్రోలింగ్ పార్టీలు తిరుగుతున్నాయని, మొత్తం నల్లగొండ పట్టణాన్ని అష్ట దిగ్బంధనం చేశారని పేర్కొన్నారు. ఆపరేషన్ చబుత్రతో ఇప్పటివరకు 128 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.1.20 లక్షలు, 62 ఈ పెట్టి కేసుల్లో రూ.56వేలు, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వందలాది వాహనాలను సీజ్ చేసి రూ.3.51లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ఏ ప్రమాదాలు, సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని కోరారు.

# ముగిసిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

- విద్యాభివృద్ధి కోసం పలు తీర్మానాలు ఆమోదం
- రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక.. అధ్యక్ష, కార్యదర్శులుగా చావ రవి, వెంకట్


టీఎస్‌యూటీఎఫ్ 2025 డైరీ, కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి, ఆ సంఘం నేతలు

రామగిరి, డిసెంబర్ 30 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 6వ మహాసభలు నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో సోమవారం విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు సాగిన ప్రతినిధుల సభలో మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్, ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవితోపాటు పలువు నేతలు పలు అంశాలపై చర్చించి తీర్మానాలు ప్రవేశపెట్టారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ - 2020)ని రద్దు చేయాలని, అందరికీ ఆమోదయోగమైన శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.నో డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ విద్యాహక్కు చట్టం 2009కి సవరణలు చేయడాన్ని ఖండించారు. విదేశీ యూనివర్సిటీలను దేశంలో నియంత్రించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఎస్, యూపీఎస్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని, ఈ మేరకు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950ని సవరించాలని తెలిపారు. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం 2025 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలని, మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత కల్పించేలా రేట్లు పెంచాలని చెప్పారు. కేజీబీవీ, యూఆర్ఎస్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు టీచర్లందరికీ మినిమం బేసిక్ పేను అందించాలని, హెల్త్‌కార్డుల ఇవ్వాలని తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, కోశాధికారి లక్ష్మారెడ్డి, పి.మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, వెంకట్, నాగమని, నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కా శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, మాజీ అధ్యక్షుడు ఎడ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా చావ రవి, ఎ.వెంకట్‌తోపాటు కార్యవర్గం ఎన్నిక చేయగా దానిలో నల్లగొండ జిల్లా నేతలకు కీలక పదవులు దక్కాయి. వీరిలో రాష్ట్ర కార్యదర్శులు నల్లగొండ జిల్లా నుంచి ఎం. రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, సూర్యాపేట జిల్లా నుంచి సీహెచ్. రాములు ఉన్నారుఏ. కుటుంబ సంక్షేమ నిధి చైర్మన్‌గా జిల్లా వాసి ఎం.రాజశేఖర్ రెడ్డి, కోశాధికారిగా ఎడ్ల సైదులుకు అవకాశం దక్కింది. నూతన కమిటీకి ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డితోపాటు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ 2025 డైరీ, కాలెండర్‌ను ఆవిష్కరించారు.

# మహిళలపై పెరిగిన నేరాలు

## ఆందోళన కలిగిస్తున్న సూర్యాపేట జిల్లా గణాంకాలు

- 43 శాతం పెరిగిన సైబర్ క్రైమ్
- ఇసుక మాఫియా, వైట్ కాలర్ నేరాలూ ఎక్కువే
- వార్షిక నేర నివేదికలో వెల్లడి


సూర్యాపేట జిల్లా వార్షిక నేర నివేదిక విడుదల చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట, డిసెంబర్ 30 : సూర్యాపేట జిల్లాలో నేరాల సంఖ్య పెరుగుతున్నది. మహిళా రక్షణ సైతం ఆందోళనకరంగా మారింది. 2023 సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి. ఇసుక మాఫియా రెచ్చిపోయింది. సైబర్ క్రైమ్ కూడా 43శాతం పెరిగింది. దొంగతనాలు, గంజాయి, పీడీఎస్ మాఫియాపై కేసులూ పెరిగాయి. జాతీయ రహదారులే గాక గ్రామీణ ప్రాంత రోడ్ల మీద రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగాయి. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం విడుదల చేసిన వార్షిక నేర నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

సూర్యాపేట జిల్లాలో 2023లో మహిళలపై లైంగిక దాడులు జరిగిన కేసులు 63 నమోదవగా, ఈ సంవత్సరం 84కి పెరిగాయి. వేధింపుల కేసులు గతేడాది 341 ఉండగా.. ఈ సారి 366, ఈవ్‌టీజింగ్ 67, కిడ్నాప్‌లు 28, హత్యలు 5, పిటీ కేసులు 98 నమోదయ్యాయి. షీటీమ్స్ ద్వారా 310 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 135 ఫ్యామిలీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. భరోసా కేంద్రానికి 129 కేసులు వచ్చాయి. 88 మంది బాధితులను నష్టపరిహారం కోసం కలెక్టర్‌కు రెఫర్ చేశారు.

**సైబర్, వైట్ కాలర్ నేరాలూ అధికమే :**

ఈజీ మనీ కోసం సైబర్, వైట్‌కాలర్ నేరాలకు పాల్పడిన వారి సంఖ్య పెరిగింది. జిల్లావ్యాప్తంగా గతేడాదితో పోలిస్తే సైబర్ నెరాలు భారీగా పెరిగాయి. 2023లో 844 ఫిర్యాదులు వస్తే 2024లో 1,212 అందాయి. వాటిలో 205 కేసులు నమోదయ్యాయి. సైబర్ మోసాల్లో రూ.7,83,12,751 నగదు పోగా, వాటిలో రూ.39,04,664 రికవరీ చేశారు. బ్యాంకుల్లో రూ. 1,16,05,088 నగదు ఫ్రీజ్ చేశారు. గతేడాదితో పోల్చితే రికవరీ భారీగా పెరిగింది. వైట్ కాలర్ నేరగాళ్లు దందా పెరిగింది. 2023లో ఒక్క కేసు నమోదు కాగా 2024లో 12 కేసులు అయ్యాయి. అత్యధికంగా పీడీఎస్, సీఎంఆర్ దాందా కేసులు ఉన్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు. అక్రమ ఇసుక దందా కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా 178 పీడీఎస్ కేసులు నమోదు కాగా, 3,198 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 289 మందిపై కేసులు నమోదు కాగా ఇద్దరిపై పీడీయాక్ట్ అమలు చేశారు.

జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోయింది. గతేడాదితో పోల్చితే జిల్లా వ్యాప్తంగా 154 శాతం కేసులు పెరిగాయి. 2023లో 205 కేసులు నమోదు చేసి 285 మందిని అరెస్ట్ చేయగా, 2024లో 522 కేసులు నమోదు చేసి 655 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇవి పోలీసులకు దొరికిన వారి లెక్కలు మాత్రమే. ముఖ్యంగా తుంగతుర్తి నియోజక వర్గంలో ఇసుక మాఫియా ఆగడాలు అధికంగా ఉన్నాయి.

**37 శాతం పెరిగిన చోరీలు..**

జిల్లాలో దొంగతనాల సంఖ్య కిందటేడు కంటే పెరిగింది. 2023లో 390 కేసులు ఉండగా, ఈ ఏడాది 536 నమోదయ్యాయి. 338 కేసులు డిటెక్ట్ చేశారు. మొత్తం 4,92,66,194 నగదు అపహరణకు గురికాగా, రూ.2,18,58,167 రికవరీ చేశారు. ఈ ఏడాది 1,780 సెల్ ఫోన్లు చోరీ కాగా, 1,140 రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లావ్యాప్తంగా కేకాట కేసులు 54 నమోదు కాగా 64వేల నగదు స్వాధీనం చేసుకుని 313 మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

**ప్రధాన ఘటనలు..**

- కోదాడ రూరల్ పరిధిలో 32.5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై పీడీ యాక్ట్ పెట్టారు.
- మేళ్లచెర్వు మండలంలో దోపిడీ కేసును 12 గంటలలో ఛేదించారు. ఈ కేసులో 6.5 తులాల బంగారం, 30 తులాల వెండి, ఇన్నోవా కారును రికవరి చేసి, ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు.
- రైతులు రోడ్డు పక్కన పెట్టుకున్న ట్రాక్టర్ ట్రక్కులను దొంగలించే ముఠాను పట్టుకున్నారు. 19 ట్రాలీలు రికవరీ చేశారు. ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు.
- సెప్టెంబర్ నెలల జిల్లాలో వచ్చిన భారీ వర్షాల్లో 54 మందిని కాపాడారు. ముంపు బాధిత గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**రోడ్డు ప్రమాదాల్లో 262 మంది మృత్యువాత...**

ఈ ఏడాది జిల్లాలో 609 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 262 మంది మరణించగా, 544 మంది గాయపడ్డారు. గతేడాదితో పోలిచ్చతే కేవలం 1.9 శాతం మరణాల సంఖ్య పెరిగింది. అత్యధికంగా బైక్ ప్రమాదాలతోనే మరణాలు పెరిగాయి. 320 బైక్ యాక్సిడెంట్లు ఉండగా 151 మంది చనిపోయారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మరణించారు.

గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి రవాణా అడ్డుకోవడంలో మంచి ఫలితాలు సాధించారు. 2024లో 38 కేసులు నమోదు చేసి 318 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 135 మందిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

జిల్లావ్యాప్తంగా పోలీస్ స్టేషనల్లో ఫిర్యాదుల సంఖ్య తగ్గింది. 2023లో 12,436 ఫిర్యాదు రాగా, 7244 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయ్యాయి. 2024లో 11,110 ఫిర్యాదులు రాగా 7,178 కేసులు ఎఫ్ఐఆర్ చేశారు. డయల్ 100కు 34,950 కాల్స్ రాగా, పోలీసులు సగటున 6 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమావేశంలో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ముగ్గులు వేసి నిరసన

## 21వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె


నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ముగ్గులు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 30 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెల్గురి కృష్ణ, బొమ్మగాని రాజు మాట్లాడుతూ 21 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు తమ మద్దతుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు కంచర్ల మహేందర్, క్రాంతి, చంద్రశేఖర్, నీలంబారి, మంజులారెడ్డి, సావిత్రి, పుష్పలత, సాయిలు, వెంకట్, వెంకటేశ్వర్లు, నాగయ్య, నాగరాజు, రవి, కొండయ్య, యాదయ్య, వెంకట్, వెంకటేశ్వర్లు, దార వెంకన్న, భిక్షమాచారి, పరమేశ్, పోలగోని రవి కుమార్ పాల్గొన్నారు.